
# మార్పులో మనుగడ

రేపు రావలసిన మగపెళ్ళివారు ఇవాళే వచ్చి విడిది చేస్తే అన్ని బాధ్యతలూ వహించవలసిన పెళ్ళి పెద్దకి ఎంత కంగారుగా ఉంటుంది? రేపు అన్నది ఇవాళనే వచ్చివాలితే మనం ఎలా రియాక్ట్ అవుతాం? ఇది ఒక విచిత్రమైన పరిస్థితి. రేపటి తరం వాళ్ళు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోక తప్పదని అంటాడు ఆల్విన్ టాఫ్లర్ (సామాజిక శాస్త్రవేత్త). అలా ఎదురయ్యే సమస్యను ఒక రుగ్మతగా గుర్తించి దానికి ఫ్యూచర్ షాక్ అని నామకరణం చేశాడు. సమకాలిక జీవితంలో మనం తరుమూ మాస్తున్న అశాంతి, క్రౌర్యం, హింసా, సామూహికమైన ఉద్రేకం ఈ రాబోయే వ్యాధిని హెచ్చరించే రోగ లక్షణాలంటాడు.

ఆది మానవుడు మృగాల్ని వేటాడుతూ, తోళ్ళు శరీరానికి చుట్టుకుని కొండ గుహల్లో తలదాచుకున్నాడు. దేశ దిమ్మరిగా తిరిగాడు. నివాసం చేసుకున్నాడు. చక్రం కనిపెట్టి శ్రమ భారం తగ్గించుకున్నాడు. క్రమక్రమంగా ఆధునికుడిగా రూపుదిద్దుకున్నాడు. నరుడి జీవిత విధానంలో ఆది నుండీ కొత్త మార్పు (పరిణామం) కనుపిస్తున్న మాట వాస్తవమే. కానీ ఈ మార్పులోని వేగం ఒకే తాళం (లయ)లో సాగలేదు. కొన్ని యుగాలుగా అతి మెల్ల మెల్లగా వస్తున్న మార్పు ఇటీవల కనీవినీ ఎరగనంత, వేగాన్ని పుంజుకుంది. పరిణామశీలమైన మానవజాతి మనుగడ సుమారు ఏభై వేల సంవత్సరాలు అని అంచనా వేసి ఒక్కొక్క తరానికి అరవై రెండు సంవత్సరాలుగా లెక్కించి ఇప్పటికి ఎనిమిది వందల తరాలు గడిచాయి అంటాడు టాఫ్లర్. అయితే ఈ ఎనిమిది వందల తరాల్లో ఆరు వందల ఏభై తరాలు మానవుడు కొండ గుహల్లోనే గడిపేశాడు. ఈ కాలంలో చెప్పుకోతగ్గ మార్పులు అతని జీవిత విధానంలో లేవు. మిగతా నూట ఏభై తరాల్లోనే చెప్పుకోదగ్గ మార్పులు వచ్చి పడ్డాయి. అందులోనూ, గత రెండు తరాల్లో వచ్చి పడ్డ మార్పును గమనిస్తే ఈ మార్పు— ఇదివరకెన్నడూ లేనంత వేగాన్ని పుంజుకుంది. ఈ పరిశీలనను రుజువు చేసేందుకు ఎన్నో వివరాలు చూపించాడు అతను రాసిన ***Future Shock*** అన్న పుస్తకంలో. అదంతా సంక్షిప్తంగా చెప్పుకోవాలనుకుంటే మనం తరుమూ ***Industrial Exhibitions*** లో చూసే జయింట్‌వీల్ ఉదాహరణగా తీసుకోవచ్చు. మనం వేడుకగా ఎక్కి కూర్చున్న తర్వాత వీల్ నెమ్మదిగా తిరుగుతూ వేగం పుంజుకుంటుంది. కొన్ని నిముషాలకు వేగం తగ్గి ఆగిపోతుంది. మనం




దిగిపోతాం. అలా అది ఆగకుండా, క్రమక్రమంగా దాని వేగాన్ని పెంచుకుంటూ పోతే అందులో ఉన్న వాళ్ళకు అది వినోదం కాక ప్రాణంపోకడగా పరిణమిస్తుంది. ఎవరో కొందరు ఏద్వంచెరగా ఈ పరిణామానికి మానసికంగా సిద్ధపడి తట్టుకోగలిగినా ఎక్కువ మందికి కళ్ళు తిరిగి, వాంతులు చేసుకుంటారు. నరాల మీద ఒత్తిడి ఎక్కువై మనోవికారానికి వాళ్ళు గురి కాక తప్పదు. ఇలాంటిదే టాఫ్లర్ చెప్పిన ఫ్యూచర్ షాక్ అనుభవం, జీవిత విధానం మీద దాని ప్రభావం.

కంప్యూటర్స్ ***1950*** ప్రాంతంలో రంగప్రవేశం చేసి మన జీవన గమనంలో వేగాన్ని ఎంతగానో పెంచేశాయి. సూపర్ సానిక్ వేగంతో ప్రయాణిస్తున్న నేటి వైమానికుడు ***1903*** లో మొదటి విమానం ప్రయోగదశలో కొన్ని సెకన్లు మాత్రమే గాలిలో ఎగిరి పడిందని వింటే నమ్మడానికి కష్టంగా ఉంటుంది. ఈనాటి స్కూలు పిల్లలు జేబుల్లో కేలిక్‌లేటర్స్ పెట్టుకుని అవలీలగా సంఖ్యల్ని కలుపుతున్నారు, హెచ్చిస్తున్నారు, ఏ సంఖ్యకైనా వర్గమూలం రాబట్టుకుంటున్నారని పాతతరం వాళ్ళు ఊహించి ఉండరు. ఈ శతాబ్ది పూర్వార్ధంలో మూడు కాళ్ళ స్టాండ్ మీద ఒక కెమెరాని పెట్టి దాని మీద ఒక నల్లని గుడ్డను కప్పి అందులో అతని తలను కూడా దూర్చి కెమెరాని అటూఇటూ కదుపుతూ, మబ్బు వచ్చిందనీ, ఎండ సరిగ్గా లేదనీ విసుక్కుంటూ మనుష్యుల్ని విసిగిస్తూ ఫోటో తీసి, రెండు మూడు రోజుల తర్వాత ఫోటోగ్రఫర్ ఫోటో కాపీలు అందిస్తే ఆనాటి ప్రజలు వాళ్ళ నీడల్ని చూసుకుని ఎంతో మురిసి పోయే వాళ్ళు. క్షణంలో (నెగెటివ్ లేకుండా) రంగుల చిత్రాన్ని తీసి చేతిలో పెడుతున్న పోలరాయిడ్ కెమెరాలు వచ్చిపడతాయని ఆనాటి ప్రజలు ఊహించి ఉండరు.

ఇప్పుడు మోటార్ సైకిళ్ళూ, స్కూటర్లూ సర్వసామాన్యమైపోయి పిక్కబలంతో తొక్కే ద్విచక్ర వాహనం (సైకిల్) పాత

బడి పోయింది. అది కొద్ది రోజుల్లో పాత కాలపు అవశేషంగా రోడ్ల మీద మాయమై పోయి చరిత్రలోకి పోవచ్చును. కాని తెలుగు దేశంలోనే జరిగిన ఒక చారిత్రాత్మకమైన ముచ్చట వింటే ఈ రోజుల్లో అవలీలగా సైకిళ్ళు తొక్కుతూ స్కూళ్ళకు పోయే చిన్న పిల్లలకు ఎంతో సిల్లీగా తోచి వాళ్ళు ముసి ముసి నవ్వులు చిందించక మానరు.

బైసికిల్ కనిపెట్టిన తర్వాత అది మన దేశంలోకి రావడానికి సుమారు పది సంవత్సరాలు దాటింది. 1896 లో శ్రీ ఆనంద గజపతి మహారాజా వారు ఏడు సైకిళ్ళను తెప్పించారు. వారూ, వారి మిత్రులూ ఒక



నెల రోజులు కోటలోనే సైకిళ్ళు తొక్కడం ప్రాక్టీసు వేశారు. ఒక రోజున వారూ, మిత్రులూ విజయనగరం ముఖ్యవీధుల గుండా సైకిళ్ళ మీద ఒక ఊరేగింపుగా వెళ్తున్నట్లు చాటింపు వేయించారు. ఈ వేడుక చూడడానికి గ్రామ గ్రామాల నుండీ జనం తరలి వచ్చి వీధులకు రెండు వేపులా బారులు తీరి నిల్చున్నారు. జెండాలు పుచ్చుకుని గుర్రాల మీద ఇద్దరు రాజభటులు హెచ్చరిక వేస్తూ వీధుల్లోంచి పోతూ ఉంటే వారి వెనుక మహారాజా వారు సైకిల్ తొక్కుతూ హుందాగా వెళ్ళారు. వారిననుసరిస్తూ మూడు జతలుగా ఆరుగురు మిత్రులు సైకిళ్ళ మీద వెళ్ళారు. వారి వెనుకనే గుర్రాల మీద రాజభటులూ, మిగతా సేవకులూ కదలి వెళ్ళారు. ప్రజలు ఆనందోత్సాహాలతో శ్రీ ఆనంద గజపతి మహారాజులుంగారికీ జై అంటూ నినాదాలు చేస్తూ అభినందిస్తూ ఉంటే మాడముచ్చటగా ఊరేగింపు సాగింది. (ఈ వింతను చూసిన వారిలో పదకొండేళ్ళ ప్రాయంలో ఉన్న స్వర్గీయ డా. గిడుగు వేంకట సీతాపతిగారు కూడా ఉన్నారు. ఈ వింతను బంధుమిత్రులకు చెప్తూ ఉండేవారు. వారు వ్రాసిన 'మహాకవి గురజాడ అప్పారావు' పుస్తకంలో ఈ విషయాన్నే గ్రంథస్థం వేశారు కూడా)

మన జీవనగమనంలో ఉరికి వస్తున్న మార్పునూ ఆ మార్పులోని వేగాన్నీ అర్థం చేసుకున్న విజ్ఞులా, వివేకం, మానసిక సంసిద్ధతా ఉన్న వారు ఈ వేగం వలన మానసికమైన ఒడుదుడుకులూ, నాడీ మండలం మీద ఒత్తిడీ లేక జీవించగలుగుతారు. అలాంటి వారే గతానికీ వర్తమానానికీ వారధి కట్టుకుంటూ ఉరికి వస్తున్న భవిష్యత్తును చిరునవ్వుతో స్వాగతం చెప్పగలుగుతారు.

గిడుగు రాజేశ్వరరావు

---

మినీకథ

## ఆలోచన

హనుమంతరావుకి అనుమానమెక్కువ.

ఫ్రెండ్సందరూ అతన్ని "అనుమానపక్షి" అంటూ ఉంటారు.

"అనుమానప్పీనుగా" అని సంబోధిస్తుంటారు.

పెళ్ళవడంతోటే అన్ని విషయాల తాలూకు అన్ని అనుమానాలు భార్యమీదికి 'ట్రాన్స్‌ఫర్' అయ్యాయి. పక్కింటి పై అంతస్థులో ఎం.ఎస్సీ ఫైనల్ చదువుతున్న "వెంకుబాబూ" ఎదురింటివాళ్ళ చిన్న మనవడు "చిట్టిబాబూ" ఎల్ఐసీ వెంకటపతీ, టీచరు సీతారామచంద్రమూర్తి వాళ్ళందరివేంకా చచ్చేంత అనుమానంగా చూస్తున్నాడీ మధ్య. పాలకుర్రాడు ఐదు నిమిషాలు ఎక్కువ నిలబడితే భార్యామణి మణి మీద పది హేను నిమిషాలు తిట్లవర్షం కురిపించేస్తాడు.

పోస్టుమేన్ ఉత్తరం ఆమె చేతికిస్తే చాలు ఆ చేతిని నరికేసేటట్టు చూస్తాడు.

భార్యామణి 'మణి' హా'హతవిధీ' వీడెక్కడి మొగుడు" అంటూ లబలబా నెత్తీ నోరు బాదుకున్నా మొదట్లో—

ఆ తర్వాతో "నిశ్చయ"ం కొచ్చింది.

ఎలాగైనా ఈయన్ని మార్చాలనుకుంది.

"నువ్వు మారు" అంటే ఎవడూ మారడు. "షాక్" తగలాలి. తగిలే చోట తగిలేలా తగలాలి.

ఎదటివాడు ఏ కర్రతో కొడుతున్నాడో తనూ అదే కర్రతో కొట్టాలన్న ఫిలాసఫీ ప్రకారం.

ఆమె కూడా అతన్ని అనుమానించడం మొదలు పెట్టింది.

"ఆ స్నానం ఏమిటి? అంత సేపు..."

"ఆ కూరగాయలమ్మితో ఆ మాటలేంటీ..."

"ఇవాళింత ఆలస్యం అయిందేమిటీ?"

వగైరా వగైరాలుగా.. కథలో వచ్చిన మార్పుకి హనుమంతరావు ఆలోచనలో పడ్డాడు. ఏం చేస్తాడు? ఛస్తాడా...?

_అడబాల వి.వి.సత్యనారాయణ